9 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం ఉదయం 8 నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు తొమ్మిది మండలాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. విజయపురం మండలంలో అత్యధికంగా 12.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. నగరిలో 9.6, పాలసముద్రం 8.6, సదుం, నింద్రలో 5.2, వెదురుకుప్పం 2.2, గుడిపాల 2, శాంతిపురం, చిత్తూరు రూరల్‌లో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఒక్కరోజే విరామం..



ధ్వంసమైన వరిపంట

పంటలపై మళ్లీ

గజదాడులు

పులిచెర్ల మండలాన్ని వీడని ఏనుగుల మంద

కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మూడు నెలలుగా పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు ఒకరోజు (గురువారం రాత్రి) మాత్రమే విరామం ఇచ్చాయి. పాకాల మండలంవైపు మళ్లిన ఏనుగులు శుక్రవారం రాత్రి మళ్లీ పులిచెర్ల మండలం లోకి ప్రవేశించాయి. ముందుగా తూర్పు అటవీవిభాగం పరిధిలోని పాతపాళ్యం అడవి నుంచి పాతపేట, చల్లావారిపల్లె వద్దకు చేరుకొని ఘీంకారం చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చల్లావారిపల్లెలోని ఎస్వీ రమణకు చెందిన మామిడితోటలోని చెట్లను విరుచుకుంటూ మతుకువారిపల్లె సమీపంలోని తోళ్లపెంటచెరువు వద్దకు చేరుకున్నాయి. మతుకువారిపల్లెలోని మునిరాజ, బాలమహేందర్‌రెడ్డిలకు చెందిన వరి పంటలను ధ్వంసం చేశాయి. వడ్డిపల్లెలోని ఆంజనేయులుకు చెందిన వరిపంటను నాశనం చేసి, రెండు కొబ్బరిచెట్లను నేలకూల్చాయి. ఇదే గ్రామానికి చెందిన వెంకటేశు, యర్రయ్యకు చెందిన వరిపంటను కూడా తొక్కేశాయి. చిట్టారెడ్డిపేటకు చెందిన కరీంకు చెందిన మామిడి తోటకు ఏర్పాటుచేసిన 15 రాతి కూసాలను ధ్వంసం చేశాయి. తర్వాత ఏనుగులు గుంపు పాతపేట మీదుగా అడవిలోని నాయనికుంట సమీపంలో తిష్ఠ వేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లిన చంద్రగిరి ఎమ్మెల్యే

పులిచెర్ల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగులు సరిహద్దులో ఉన్న పాకాల మండలంపైనా పడ్డాయి. దీంతో ఈ సమస్యను అసెంబ్లీ దృష్టికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తీసుకెళ్లారు. పంటలకు తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు.



నేలకూలిన కొబ్బరిచెట్టు

మూడు నెలలుగా ఏనుగుల గుంపును నివారించడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. నష్ట పరిహారం చెల్లించడంలోనూ అశ్రద్ధ చూపుతున్నారని ఆరోపిస్తున్నారు.

30మంది అర్చకులకు వేతనాల పెంపు

చిత్తూరు కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వార్షిక ఆదాయం రూ.50వేలు దాటిన ఆలయాల్లో అర్చకులుగా విధులు నిర్వహిస్తున్న వారికి వేతనాలు పెంచనున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా.. జిల్లాలోని 30 ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు ఇకపై నెలకు ఒక్కొక్కరికి రూ.15వేలను వేతనంగా ఇవ్వనున్నట్లు జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై అర్చక సమాఖ్య ప్రతినిధులు వేణుగోపాల్, సుధాకర్ గురుకుల్‌లు సీఎం చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ల సీనియారిటీ జాబితా

విడుదల చేయండి

- డీఈవోకు ఫ్యాప్టో నాయకుల వినతి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించి 2022 నుంచి సీనియారిటీ జాబితాను విడుదల చేయాలని ఫ్యాప్టో నాయకులు డీఈవో వరలక్ష్మికి విజ్ఞప్తి చేశారు. శనివారం డీఈవో కార్యాలయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని డీఈవో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఉపాధ్యాయుల పదోన్నతుల నేపథ్యంలో సర్వీసు రూల్స్ ఆధారంగా ప్రక్రియ చేపట్టాలన్నారు. జిల్లాలో 36 మంది పదోన్నతులు పొందినవారు ఉన్నారని, వారిలో వివిధ అనారోగ్య సమస్యలతో ఉన్న 25 మందికి రివర్షన్ ఇచ్చారని చెప్పారు. మిగిలిన 11 మందికి కూడా రివర్షన్ ఇచ్చేలా అనుమతి ఇవ్వాలని కోరారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు మునాఫ్, నాయకులు గోపీనాథ్, రమణ, మునీర్, దేవరాజులు, రమేష్, కన్నన్, చెంగల్రాయ మందడి తదితరులు పాల్గొన్నారు.





ఆత్మబంధువు అస్తమయం

నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు
హాజరు కానున్న నారా, నందమూరి కుటుంబీకులు

● చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతితో తల్లడిల్లుతున్న నారావారిపల్లె

తిరుపతి, ఆంధ్రజ్యోతి

నారావారిపల్లె తల్లడిల్లుతోంది. సుదీర్ఘకాలంగా అనారోగ్యంతో వున్న నారా రామ్మూర్తినాయుడు కన్నుమూసిన వార్త తెలిసి కన్నీరుమున్నీరవుతోంది. ఈ వార్త తెలిసినప్పటి నుంచీ బంధుమిత్రులు పెద్దసంఖ్యలో నారావారిపల్లెకు చేరుకుంటున్నారు. ఆయనతో అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు. ఒకరినొకరు ఓదార్చుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం రానున్న భౌతికకాయం కోసం ఎదురుచూస్తున్నారు.

కుటుంబం

ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మల మూడో బిడ్డ నారా రామ్మూర్తినాయుడు. వీరికి నలుగురు పిల్లలు. అందరిలోకీ పెద్ద చంద్రబాబు. తర్వాత హైమావతి, ఆమె తర్వాత రామ్మూర్తి నాయుడు, ఆయన తర్వాత రాజేశ్వరి. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ చదువుతూ మధ్యలో ఆపేశారు. శ్రీకాళహస్తి సమీపంలోని కోబాక గ్రామానికి చెందిన ఇందిరతో పెళ్లయ్యింది. వీరికి ఇద్దరు కుమారులు గిరీష్, రోహిత్. రోహిత్ సినిమా హీరోగా ప్రసిద్ధులు. గిరీష్ గల్ఫ్‌లో వ్యాపారవేత్తగా ఉన్నారు. పదహైదేళ్లుగా అనారోగ్యంతో ఉన్న రామమూర్తినాయుడు 72 ఏళ్ల వయసులో కన్నుమూశారు.



2020 మార్చి 18న తన జన్మదినం సందర్భంగా భార్య ఇందిర, కుమారులు రోహిత్, గిరీష్‌తో రామ్మూర్తి నాయుడు

15 ఏళ్ల అనారోగ్యం

1999 ఓటమి తదనంతర పరిణామాలలో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యారు. ఆ క్రమంలోనే అనారోగ్యానికి లోనయ్యారు. క్రమేపీ అల్జీమర్స్ లక్షణాలతో కుటుంబీకులను, పరిచయస్తులను గుర్తించలేకపోయారు. చంద్రబాబు చొరవ తీసుకుని కేరళలో ఆయుర్వేద వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. దీంతో ఇంటికే పరిమితమయ్యారు. గత పదిహేనేళ్ళుగా చంద్రబాబు, రామ్మూర్తినాయుడు కుటుంబాలు రెండూ ఆయనను జాగ్రత్తగా కనిపెట్టుకుంటూ వచ్చాయి. అనారోగ్యానికి వయోభారం తోడు కావడంతో పరిస్థితి దిగజారింది. వారం రోజుల కిందట హైదరాబాదులోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స తీసుకుంటూ శనివారం ఉదయం కన్నుమూశారు.

నేడు నారావారిపల్లెలో అంత్యక్రియలు

రామ్మూర్తినాయుడు భౌతిక కాయం ఆదివారం ఉదయం 8 గంటలకు హైదరాబాదు నుంచి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకోనుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 9.30 గంటలకు నారావారిపల్లె తరలిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తారు. సీఎం చంద్రబాబు సహా నారా, నందమూరి కుటుంబసభ్యులు పలువురు అంత్యక్రియలకు హాజరు కానున్నారు. వీరితో పాటు ఏపీ, తెలంగాణల నుంచి వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశముంది.

1994లో చంద్రగిరి విజేత

రామ్మూర్తినాయుడు 1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటిదాకా అన్న చంద్రబాబునాయుడికి చేదోడుగానే ఉండేవారు. చంద్రగిరిలో మణిమంతు నాయుడు, ఎల్‌బీ ప్రభాకర్ వంటి నాయకులున్నా 1994లో టీడీపీ అధినేత ఎన్‌టీ రామారావు ఆశీస్సులు రామ్మూర్తినాయుడికే లభించాయి. చంద్రగిరి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఆయన ఆ ఎన్నికల్లో గల్లా అరుణకుమారిపై 16వేలకు పైగా ఆధిక్యంతో గెలిచారు. చంద్రగిరి, పాకాల, పులిచెర్ల, ఐరాల మండలాలతో కూడిన చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయంగా ఆయన నూతన ఒరవడి సృష్టించారు. కార్యకర్తలకు పూర్తి సమయం అందుబాటులో ఉండేవారు. ప్రజలతోనూ, కార్యకర్తలతోనూ కలుపుగోలుగా వుండేవారు. మీడియా ప్రతినిధులను సైతం అన్నా, తమ్ముడూ, మామా అంటూ వరుసలు పెట్టి పిలిచేవారు. కేవలం సిఫారసు లేఖలు ఇవ్వడంతో సరిపెట్టుకోకుండా అధికారుల వెంటపడి మరీ ఆ పనులు అయ్యేదాకా పట్టుదలగా వ్యవహరించేవారు. చంద్రగిరి నియోజకవర్గంలో కమ్మ, రెడ్డి సామాజికవర్గాల ప్రాబల్యం అధికంగా వున్నప్పటికీ రెండు కులాల మధ్యా ఎలాంటి తేడా చూపకుండా వారికి దగ్గరయ్యారు. సీఎం చంద్రబాబు సోదరుడిననే అహం ఇసుమంతైనా చూపే వారు కాదు. ఇతర పార్టీల నేతలతో కూడా కలుపుగోలుగా మెలిగారు.

కాణిపాకం మాస్టర్‌ప్లాన్ మూలకర్త

చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు కాణిపాకం వినాయక ఆలయ అభివృద్ధికి మూలకారకుడిగా పేరు తెచ్చుకున్నారు. 1994కు మునుపు ఆలయమూ, ఆలయానికి వెళ్ళే రోడ్డు ఇరుకైన స్థలంలో ఉండేవి. విస్తరణకు వీలు లేని విధంగా చుట్టూ వ్యవసాయ భూములు, ప్రైవేటు నివాసాలు, దుకాణాలు వుండేవి. రామ్మూర్తినాయుడు ఎమ్మెల్యే అయ్యాక దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతోపాటు ఉభయదారులతో కలసి ఆలయ విస్తరణకు, అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఆలయం చుట్టూ భూములున్న రైతులు, సొంతదారులను ఒప్పించి భూములను సేకరించి ఆలయాన్ని విశాలంగా విస్తరించారు. అలాగే చిత్తూరు-ఐరాల రోడ్డులోని అగరంపల్లె వద్ద ప్రధాన స్వాగత తోరణం నిర్మించారు. అక్కడి నుంచి కాణిపాకానికి డబుల్ రోడ్డు నిర్మించారు. ఆలయంలో ఆర్జిత సేవలనూ మెరుగుపరిచి భక్తులు పెరిగేందుకు కారకులయ్యారు. అప్పటికి ఎన్నో ఏళ్ళుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న ఆలయ సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా సర్వీసు క్రమబద్ధీకరణ చేయించారు. ఇవాళ కాణిపాకం ఆలయం రాష్ట్రంలోని 6-ఏ కేటగిరీ ఆలయాలు ఆరింటిలో ఒకటిగా వుండడానికి రామ్మూర్తినాయుడే కారణమని చెప్పవచ్చు.

అనుచరులకు అండగా

తన వెన్నంటివున్నవారికి బలమైన అండగా ఉండేవారు. పన్నెండేళ్ళకు పైగా తనవద్ద డ్రైవరుగా పనిచేసిన నాగరాజుకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని అనుకున్నారు. ఆయన దానికి బదులు చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవి తనకు ఇప్పించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రధాన ఆలయమైనప్పటికీ రామ్మూర్తి నాయుడు ఆ పదవిని నాగరాజుకు ఇప్పించారు.

1999లో మలుపు తిరిగిన జీవితం

చంద్రగిరి ఎమ్మెల్యేగా 1994-99 నడుమ విజయవంతంగా పనిచేసిన రామ్మూర్తినాయుడు రాజకీయ, వ్యక్తిగత జీవితం 1999 ఎన్నికల్లో ఓటమి తర్వాత మలుపు తిరిగింది. 1999-2004 నడుమ ఆయన రాజకీయంగా సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. 1999 ఎన్నికల్లో టీడీపీ తరపున రెండో పర్యాయం పోటీ చేసిన ఆయన కేవలం 2271 ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. నియోజకవర్గంలో కొందరు టీడీపీ ముఖ్య నాయకులు ఆయన గెలుపునకు సహకరించలేదన్న ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఓటమి తర్వాత ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గుతూ వచ్చింది. తదుపరి ఎన్నికల్లో టికెట్ దక్కే పరిస్థితి లేదని తెలియడంతో 2003లో ఆయన టీడీపీని వీడారు. చంద్రబాబును రాజకీయంగా దెబ్బ తీయడానికి రామ్మూర్తినాయుడిని వాడుకునే వ్యూహానికి కాంగ్రెస్ పార్టీ పెద్దలు యత్నించారు. ఆయన్ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పటికీ 2004 ఎన్నికల్లో చంద్రగిరి అసెంబ్లీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన కాంగ్రెస్ నుంచీ బయటికొచ్చారు. అప్పట్లో తిరుపతి బాలాజీ కాలనీ కూడలిలో కాంగ్రెస్ అధినేత సోనియా కటౌట్‌లు తగులబెట్టడం సంచలనం రేపింది. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి టీడీపీ కంటే ఎక్కువ ఓట్లు సాధించి నియోజకవర్గంలో తన బలాన్ని చాటారు. కాంగ్రెస్ అభ్యర్థి గల్లా అరుణకుమారికి 46,838 ఓట్లు రాగా, రామ్మూర్తి నాయుడుకు 36 వేల ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 32 వేల ఓట్లు పడ్డాయి.

సీఎం సొంతూరులో భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఆదివారం రామ్మూర్తినాయుడి అంత్యక్రియల నేపథ్యంలో పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. శనివారం మధ్యాహ్నమే ఎస్పీ సుబ్బరాయుడు గ్రామానికి చేరుకుని అక్కడ తీసుకోవాల్సిన బందోబస్తు చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు, సీఎం బంధువులతో సమావేశమయ్యారు. సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతుండడంతో భద్రతా చర్యలపై దృష్టి పెట్టారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ రవి మనోహరాచ్చారి, తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుపతి, చంద్రగిరి పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. సీఎం నివాసం వద్ద ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. నారావారిపల్లెకు వెళ్లే అన్ని రహదారుల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. డీఐజీతో పాటు ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు నలుగురు, 10 మంది డీఎస్పీలు, 30 మంది సీఐలు, 100 మంది ఎస్‌ఐలు, మరో 200 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 800 మంది కానిస్టేబుళ్లు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు నిర్వీర్యం స్క్వాడ్‌లు, రోప్ పార్టీలు, రోడ్డు డిగ్గింగ్ సిబ్బంది, మెటల్ డిటెక్టర్ టీమ్‌లు బందోబస్తు విధుల్లో ఉన్నారు. మరోవైపు పోలీసు అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు అత్యవసర సమావేశం నిర్వహించారు. భౌతిక కాయం వద్దకు అనుమతి ఉన్న వారినే పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీఐపీలు, ప్రముఖులు, పార్టీల నాయకులు, బంధువులు, ఇతర అనుచరులకు వేర్వేరుగా షామియానాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ అనుమతి మేరకు మాత్రమే భౌతికకాయం వద్దకు పంపాలని, మిగిలిన వారిని సందర్శన నిమిత్తం కొంత దూరం నుంచే పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



నారావారిపల్లెలో సీఎం ఇంటి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, కమిషనర్

నారావారిపల్లెలో ఏర్పాట్లు

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం ఉదయం నారా రామ్మూర్తినాయుడి భౌతికకాయం రానుంది. మధ్యాహ్నం అంత్యక్రియలు జరగనున్నాయి. రామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులతో పాటు సీఎం చంద్రబాబు, మంత్రులు, నారా, నందమూరి కుటుంబ సభ్యులు, కూటమి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరుకానున్నారు. దీంతో శనివారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కార్పొరేషన్ కమిషనరు మౌర్య, పలువురు జిల్లా అధికారులు నారావారిపల్లెలో ఏర్పాట్లను పరిశీలించారు. అంత్యక్రియల ఏర్పాట్లను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పర్యవేక్షిస్తున్నారు.

నేడు ప్రముఖుల రాక

● నారావారిపల్లె రానున్న సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర గవర్నర్, వీఐపీలు

తిరుపతి(కలెక్టరేట్/నేరవిభాగం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో ఆదివారం నారా రామ్మూర్తినాయుడు భౌతిక కాయానికి నివాళులర్పించడానికి వీవీఐపీలు రానున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాదు నుంచి ఉదయం పది గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన స్వగ్రామానికి చేరుకుని తమ్ముడి అంత్యక్రియల్లో పాల్గొంటారు. మంత్రి నారా లోకేశ్ కూడా ఉదయం 5.15 గంటలకు ఏఐజీ ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ్నుంచి 6గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేకవిమానంలో 7.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 8.30 గంటలకు నారావారిపల్లెకు చేరుకుంటారని కలెక్టర్ వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే, మహారాష్ట్ర గవర్నర్ సి.పి.రాధాకృష్ణన్ ఉదయం 9.45గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ్నుంచి నారావారిపల్లె చేరుకుని రామ్మూర్తి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తారు. 11.45 గంటలకు తిరుగు ప్రయాణమై పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు. సాయంత్రం 4గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు. ఇంకా, రాష్ట్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ప్రముఖులు హాజరుకానున్నారు.

చిత్తూరు జిల్లాతో మంచి అనుబంధం



రామ్మూర్తి నాయుడితో ఐరాల మండల నాయకులు (ఫైల్ ఫొటో)

చిత్తూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడికి చిత్తూరు జిల్లాతో మంచి అనుబంధం ఉంది. ఆయన చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ నియోజకవర్గంలో ఐరాల, పులిచెర్ల మండలాలు ఉండేవి. దీంతో ఈ రెండు మండలాల అభివృద్ధిలో తన ముద్రవేశారు.

చిత్తూరు నాయకులతో దోస్తీ..

చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నా.. లేకున్నా.. రామ్మూర్తి నాయుడికి చిత్తూరు నాయకులతో దోస్తీ ఉండేది. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విజయ డెయిరీ ప్రెసిడెంట్‌గా తొలిసారి పోటీ చేసినప్పుడు రామ్మూర్తి నాయుడు ఇక్కడే మకాం వేసి ఆయన గెలుపు కోసం కృషి చేశారు. అలాగే, ఏఎస్ మనోహర్‌కు 1995లో మున్సిపల్, 1999లో ఎమ్మెల్యే ఎన్నికల కోసం వెన్నంటే ఉంటూ ప్రచారం చేశారు. 2014లో సత్యప్రభ ఎన్నికల్లో కూడా ఆరోగ్యం సహకరించకపోయినా చిత్తూరుకు వచ్చి తన వంతు కృషి చేశారు.

ఏఎస్ మనోహర్ విజయం కోసం..

1994 సాధారణ ఎన్నికల్లో చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన ఏఎస్ మనోహర్‌ను.. రెండు నెలల తర్వాత 1995 జనవరిలో జరిగిన చిత్తూరు మున్సిపల్ ఛైర్మన్‌గా అధిష్ఠానం అవకాశం కల్పించింది. ఆ ఎన్నికలకు చంద్రబాబు ఆదేశాలతో చంద్రగిరి ఎమ్మెల్యే హోదాలో రామ్మూర్తి నాయుడు చిత్తూరులో ఏఎస్ మనోహర్ గెలుపు కోసం పనిచేశారు. బయటి వ్యక్తి ఇక్కడికి వచ్చి హల్‌చల్ చేస్తున్నారంటూ అప్పటి ఎస్పీ త్రిపాఠి అడ్డుకోబోతే.. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఇంట్లో రామ్మూర్తి నాయుడు ఉండిపోయారు. ఆ ఎన్నికల్లో ఏఎస్ మనోహర్ రాష్ట్రంలోనే అత్యధికంగా 26వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి జ్యోతినాథ్, స్వతంత్ర అభ్యర్థి సీకే లావణ్యపై గెలిచారు. అలాగే ఏఎస్ మనోహర్ 1999లో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడూ ప్రచారంలో పాల్గొన్నారు.



రామ్మూర్తి నాయుడిని సన్మానిస్తున్న మద్దిపట్లపల్లె చౌదరి (ఫైల్ ఫొటో)

పులిచెర్లలో ఇలా..

1994-99 మధ్య చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పులిచెర్ల మండలంలోని కల్లూరు పోలీస్‌స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, టీటీడీ కళ్యాణమండపం తదితర నూతన భవనాలను నిర్మించారు. మండలానికి చెందిన తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు, టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌తో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త స్వర్గీయ వారణాసి మధుసూదన్‌రెడ్డి, టీడీపీ సీనియర్ లీడర్ స్వర్గీయ లంకిపల్లె మణిమంతునాయుడితోనూ సన్నిహితంగా ఉండేవారు.

టీడీపీ నాయకుల నివాళి



కల్లూరులో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నేతలు

కల్లూరు/ సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని నాలుగు రోడ్ల కూడలిలో రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి శనివారం టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు మాట్లాడుతూ.. కార్యకర్తలతో, నాయకులతో స్నేహ భావంతో మెలిగేవారని గుర్తు చేసుకున్నారు. నాయకులు కుమార్‌రెడ్డి, నారాయణస్వామి నాయుడు, నూర్‌బాషా, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. ● సోమల బస్టాండు కూడలిలోనూ టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, నాయకులు హరిప్రసాద్, శ్రీనివాసులు నాయుడు, శివశంకర్, ఉమాపతి నాయుడు, మహేంద్రబాబు, సుబ్రమణ్యం యాదవ్, వేణుగోపాల్ నాయుడు, సూరిశెట్టి సుధాకర్, పి.శ్రీనివాసులు, బాలాజీ నాయుడు, వైవీ సుబ్బయ్యశెట్టి, రమేశ్‌నాయుడు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతాపం తెలిపిన ఎంపీ, ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారా రామ్మూర్తి నాయుడి మృతిపట్ల టీడీపీ నేతలు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వీరిలో.. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ తదితరులు ఉన్నారు.

● ఆత్మీయుల మాట

నన్ను కచ్చితంగా కలిసేవారు



1988 నుంచి రామ్మూర్తి నాయుడితో నాకు మంచి అనుబంధం ఉంది. విజయ డెయిరీ ఛైర్మన్ ఎన్నికల్లో నన్ను గెలిపించడానికి కృషి చేశారు. 1994లో ఆయన ఎమ్మెల్యేగా చంద్రగిరిలో పోటీ చేసినప్పుడు నేను ఆయన కోసం ప్రచారం చేశాను. చిత్తూరుకు ఎప్పుడు వచ్చినా కచ్చితంగా నన్ను కలిసి వెళ్లేవారు. భోళా శంకరుడు. ఏదీ మనసులో దాచుకోడు. ఆయన మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది.

- దొరబాబు, మాజీ ఎమ్మెల్సీ, చిత్తూరు

ఐరాల మండలం ఓ వెలుగు వెలిగింది



కాణిపాకం ఆలయం ఈ స్థాయిలో అభివృద్ధి చెందిందటే రామ్మూర్తి నాయుడే కారణం. కాణిపాకమే కాదు, ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఐరాల మండలం అభివృద్ధి విషయంలో ఓ వెలుగు వెలిగింది. కాణిపాకం అభివృద్ధిలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు దగ్గరుండి పరిహారం ఇప్పించారు. మా ఊర్లో గుడి కట్టించేందుకు ఆదికేశవులుతో మాట్లాడి నిధులు సమీకరించారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా నన్ను.. కట్టమంచి సురేంద్రరెడ్డిపైన పోటీ చేయించి గెలిపించారు. ఆయన హయాంలో నేను సర్పంచిగానూ పనిచేశాను. చివరి వరకూ ఆయనతో అనుబంధం ఉంది. శనివారం కూడా నేను నారావారిపల్లెలో ఏర్పాట్లు చూసుకుంటున్నాను.

- చౌదరి, మద్దిపట్లపల్లె, ఐరాల మండలం

అభివృద్ధి కోసం నిరంతరం తపించేవారు



రామ్మూర్తి నాయుడు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం తపించేవారు. నాయకులు, కార్యకర్తలతో స్నేహభావంతో మెలిగేవారు. ఆయనతో నాకు మంచి అనుబంధం ఉంది.

- రామనాథం నాయుడు, తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పులిచెర్ల

కాలేజీ రోజుల నుంచే స్నేహం



రామ్మూర్తి నాయుడు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే మోహన్, నేను తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో కలిసి చదువుకున్నాం. 1994లో మా ముగ్గురికీ ఎన్టీఆర్ ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. వారిద్దరూ గెలిస్తే.. నేను స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయాను. 1995లో జరిగిన మున్సిపల్, 1999 నాటి ఎమ్మెల్యే ఎన్నికల్లో నాకోసం తీవ్రంగా కృషి చేశారు. 2004-09 మధ్యకాలంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హైదరాబాదులో రెగ్యులర్‌గా కలిసేవాళ్లం. కాలేజీ నుంచి మొదలైన స్నేహం రాజకీయాల్లోనూ కొనసాగింది. ఎవరొచ్చినా కాదనకుండా సాయం చేసే మంచి మనిషి.

- ఏఎస్ మనోహర్, మాజీ ఎమ్మెల్యే

కాణిపాకంలో మూడు ఆలయాలకు మహాకుంభాభిషేకం



వరదరాజస్వామి ఆలయ కుంభాభిషేకం సందర్భంగా అయ్యంగార్లతో రామ్మూర్తి నాయుడు (ఫైల్ ఫొటో)

ఐరాల(కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంపై రామ్మూర్తి నాయుడు చెరగని ముద్ర వేశారు. ప్రధాన ఆలయానికి అనుబంధంగా మణికంఠేశ్వర స్వామి ఆలయం, వరదరాజ స్వామి ఆలయాలను పునః నిర్మించి, వాటికి మహాకుంభాభిషేకం నిర్వహించిన ఘనత ఆయనదే దక్కింది.

భానుప్రకాష్ శ్రద్ధాంజలి



నగరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామ్మూర్తి నాయుడి మృతదేహానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శ్రద్ధాంజలి ఘటించారు. హైదరాబాదులోని ఏఐజీ వైద్యశాలలో మృతి చెందిన రామ్మూర్తి నాయుడి భౌతికకాయాన్ని శనివారం ఆయన సందర్శించి, కుటుంబీకులను పరామర్శించారు.



శ్రమదానం

సొంత ఖర్చులతో రోడ్డుపై గుంతను పూడ్చిన యువత

బంగారుపాళ్యం మండలంలోని జంబువారి పల్లె రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ రహదారిలో జంబువారిపల్లె, దండువారిపల్లె, ముంగరమడుగు, 170 గొల్లపల్లె, బోడబండ్ల తదితర గ్రామాలవారు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గుంత వల్ల అప్పుడప్పుడూ ప్రమాదాలూ జరుగుతున్నాయి. వీటిని నివారించడానికి ముంగరమడుగు గ్రామానికి చెందిన యువకులు సతీష్, ఉదయ్, నవీన్, మనోజ్ నడుం బిగించారు. తమ సొంత ఖర్చులతో ఈ గుంతను శనివారం పూడ్చారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న పొదలను కూడా తొలగించారు.

- బంగారుపాళ్యం, ఆంధ్రజ్యోతి

రహదారిపై 'స్కార్పియో' దగ్ధం

డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు తప్పిన ప్రమాదం







మంటల్లో కాలుతున్న వాహనం - మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది - దగ్ధమైన వాహనం

పలమనేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఓ స్కార్పియో వాహనం దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతతో వాహనంలోని ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. కర్ణాటక రాష్ట్రం ముళబాగల్‌కు చెందిన ఏడుగురు (ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు) ఓ స్కార్పియో వాహనంలో తమిళనాడులోని తిరువణ్ణామలైకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పలమనేరు సమీపంలోకి రాగానే వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి.. అందులోని వారందరినీ దింపేసి, దూరంగా వెళ్లిపోయారు. స్థానికులు తగలబడుతున్న వాహనాన్ని చూసి.. పలమనేరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది ప్రమాద స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.2లక్షలు ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని ఫైర్‌స్టేషన్ సిబ్బంది తెలిపారు. కాగా, ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఆలస్యంగా రావడం వల్లే వాహనం పూర్తిగా కాలిపోయిందన్న విమర్శలొస్తున్నాయి. ఫైర్‌స్టేషన్ సిబ్బంది మాత్రం తమకు సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నామని చెప్పారు.

పలమనేరు మీదుగా రేషన్ బియ్యం అక్రమ రవాణా

పట్టించుకునే వారేరి?





పలమనేరులో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ (ఫైల్ ఫొటో)

పలమనేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మీదుగా రోజురోజుకు రేషన్ బియ్యం అక్రమ రవాణా పెరిగిపోతోంది. పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యంలో దాదాపు 60శాతానికి పైగా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. నియోజకవర్గం అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు అతి చేరువలో ఉండటంతో బియ్యం స్మగ్లర్లు పాగా వేశారు. ప్రతినెలా పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని కొందరు ఇంటింటికీ వెళ్లి కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి, ఓచోట నిల్వ ఉంచుతున్నారు. ఇలా నిల్వ ఉంచిన బియ్యాన్ని రాత్రివేళల్లో ఆటోలు, మినీ లారీల్లో స్మగ్లర్లు లోడ్ చేయించి.. కర్ణాటక, తమిళనాడుకు తరలించి లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారు. ఈ దందాపై పోలీసులు మాత్రమే మొక్కుబడిగా దాడులు చేస్తున్నారు. బియ్యం అక్రమంగా తరలించే ఒకటి, రెండు వాహనాలు పట్టుకుంటున్నారు. మిగిలిన శాఖలేవీ ఈ అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదు. దీనికి ప్రధాన కారణం.. వారికి మామూళ్లు అందడమే అన్న ఆరోపణలూ లేకపోలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశోక్‌ఎస్‌కినాగి శనివారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఎస్‌ఐ ధరణిధర తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామిపై జనసేన ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న యుగంధర్, పురుషోత్తం, సతీష్ తదితరులు

వెదురుకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయనపై కేసు నమోదు చేయండి' అని వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్యకు జీడీనెల్లూరు జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న శనివారం ఫిర్యాదు చేశారు. నారాయణస్వామి అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలు వైరల్ అవుతున్నాయని తెలిపారు. ఆయనవెంట జనసేన వెదురుకుప్పం మండల అధ్యక్షుడు పురుషోత్తం, నియోజకవర్గ బూత్ కన్వీనర్ యతీశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెనర్జీ, యువజన అధ్యక్షుడు సతీష్ ఉన్నారు.

మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలి

● కలెక్టరేట్ వద్ద వర్కర్ల ధర్నా



కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

చిత్తూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మినీ అంగన్వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చాలంటూ శనివారం కలెక్టరేట్ వద్ద వర్కర్లు ధర్నా నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షులు గంగరాజు, కార్యదర్శి షకీలా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అంగన్వాడీలకు చేసిన అన్యాయం కారణంగానే ఇంటికి పంపించామని గుర్తుచేశారు. ఒకే యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. జిల్లాలో వర్కర్లపై అధికారుల వేధింపులను మానుకోవాలని, లేకుంటే పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు. నేతలు ప్రమీల, సరళ, అనిత, శోభ, ఎర్రమ్మ, లీలావతి పాల్గొన్నారు.

'బాల స్వస్థ' అమలుపై కలెక్టర్ సమీక్ష

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ నుంచి డీఎంహెచ్‌వో, డీఈవో, ఐసీడీఎస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం అమలుపై కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం సమీక్షించారు. మూడు శాఖల అధికారులు వైల్డ్ హెల్త్ స్ర్కీనింగ్‌ను సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, ట్రాక్టర్ ఢీ

బిడ్డ దుర్మరణం, తల్లికి స్వల్ప గాయాలు



బిడ్డ మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

చిత్తూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. తల్లికి స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులోని దుర్గానగర్‌కాలనీలో కిరణ్, స్వప్న కుటుంబం నివాసం ఉంటోంది. వీరికి కుమారుడు జయనిరాష్(7), కుమార్తె ఉన్నారు. జయనిరాష్ రెండో తరగతి చదువుతున్నాడు. బీవీరెడ్డి పాఠశాలలో వదిలిపెట్టడానికి శనివారం ఉదయం ఇంటి నుంచి కుమారుడిని తల్లి స్వప్న తన ద్విచక్రవాహనంలో తీసుకుని బయల్దేరింది. మెసానికల్ మైదానం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జయనిరాష్ ట్రాక్టర్ చక్రాల కింద పడిపోగా.. తల్లి స్వప్న ఎడమవైపు పడిపోయింది. బాలుడిపై ట్రాక్టర్ చక్రాలు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నిత్యబాబు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

- ఒకరి అరెస్టు



చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి-బెంగళూరు హైవేలోని చెర్లోపల్లె క్రాస్‌వద్ద దాడులు నిర్వహించారు. చెర్లోపల్లెకు చెందిన మురుగన్ కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న 86 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్‌ఐ మోహనక్రిష్ణ, సిబ్బంది శరవణ, దామోదర్, ప్రసన్నకుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

'సారా' సామ్రాజ్యంపై ఎక్సైజ్ దాడులు





ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం మండలాల్లోని మర్రిపల్లె, యనమలమంద శివార్లో సారా ఊట ధ్వంసం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెదురుకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సారా స్థావరాలపై శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించింది. 'సారా' సామ్రాజ్యం..? అన్న శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అసిస్టెంటు కమిషనరు స్పందించి, దాడులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ సీఐ వైవీ పవన్‌కుమార్, ఎస్‌ఐ అశోక్, కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి తమ సిబ్బందితో కలసి కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దాడులు చేశారు. పాలసముద్రం మండలంలో నరసింహాపురానికి చెందిన సుమతి సారా అమ్ముతుండగా 20లీటర్లను స్వాధీనం చేసుకుని, ఆమెను అరెస్టు చేశారు. వెదురుకుప్పం మండలం యనమలమంద శివారు ప్రాంతాల్లో 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. ఎస్ఆర్‌పురం మండలం మర్రిపల్లె శివారు ప్రాంతాల్లో 400 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో సుందరం, రాజ్‌దీప్, గీత, పళని, గుర్రప్ప, రామన్, హరిప్రసాద్, చంద్రమోహన్, పుత్లీబాయి, విజయ పాల్గొన్నారు.



కార్వేటినగరం ఎక్సైజ్ స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న సారాతో సిబ్బంది

రూపురేఖలు మారనున్న సైన్స్ మ్యూజియం

కలెక్టర్ చొరవతో రూ.20లక్షలతో జోరుగా అభివృద్ధి పనులు



జిల్లా సైన్స్ మ్యూజియం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని జిల్లా సైన్స్ మ్యూజియం కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవతో రూపురేఖలు మారనుంది. జిల్లా సైన్స్ అధికారి రమణ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. అన్నీ సక్రమంగా పూర్తియితే డిసెంబరు మొదటి వారంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ వర్చువల్‌గా పునః ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మ్యూజియం అందుబాటులోకి వస్తే విద్యార్థుల్లో భౌతిక, రసాయన శాస్త్రాలు, మ్యాథ్స్‌లో చైతన్యం పెరిగే అవకాశాలు ఉన్నాయి. అటవీ శాఖ తూర్పు విభాగం పరిధిలోని నాలుగు విభాగాలతో రూపొందిన జిల్లా సైన్స్ మ్యూజియాన్ని రూ.12 లక్షలతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. రూ.2 లక్షలతో సైన్స్ పరికరాలు, కొత్త నమూనాలు ఏర్పాటు చేయనున్నారు. రూ.4లక్షలతో భౌతిక, రసాయన శాస్త్రాలు, మ్యాథ్స్ సబ్జెక్టుకు సంబంధించి కిట్ మెటీరియల్స్ ఏర్పాటు చేస్తారు. రూ.లక్షను విద్యార్థులు కొత్తగా తయారు చేసే నమూనాలకు వెచ్చించనుండగా, మరో రూ.లక్షను నిర్వహణ నిధుల కింద ఖర్చు చేయనున్నారు.

పాడిఆవుల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : జేడీ



పి.బి.అగ్రహారంలో గోకులం షెడ్‌ను పరిశీలిస్తున్న ప్రభాకర్

గంగాధర నెల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున పాడి ఆవుల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ సూచించారు. గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు పంచాయతీ పి.బి.అగ్రహారంలో గోకులంషెడ్‌ను పరిశీలించారు. ఎట్టేరి, సిద్దేశ్వరకొండ, పాలసముద్రం, తిరుమలరాజుపురం గ్రామాల్లోని వెటర్నరీ ఆస్పత్రులను ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు వెటర్నరీ ఏడీ డాక్టర్ మురళీ మోహన్, ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



ఎన్‌సీసీ క్యాడెట్లకు సూచనలిస్తున్న అధికారులు

చిత్తూరుసెంట్రల్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తుల్లో భాగంగా ఏర్పడే అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని 35వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ మోనిస్, ఏవో మేజర్ లోకనాథ్ అన్నారు. క్యాంపులో భాగంగా శనివారం అగ్నిమాపక అధికారుల డెమోని ఆ శాఖ అధికారులు సురేష్‌రెడ్డి, జానకిరామం, లోకేష్, రాములు నిర్వహించి, పలు సూచనలిచ్చారు. తిరుపతి గ్రూప్ కమాండింగ్ అధికారి కల్నల్ సతీందర్ దహియా సెంటర్‌ను, శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. ఎన్‌సీసీ అధికారులు ప్రసాద్ రెడ్డి, బాలాజీ, యుగంధర్, కార్తీక్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు


గ్లూకోమీటర్లు అందిస్తున్న డాక్టరు సురేష్‌బాబు

కుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కడా పీవో వికాస్ మర్మత్ తెలిపారు. కుప్పం పరిధిలో ఇంటింటా ఆరోగ్య సర్వే నిర్వహించేందుకు వైద్యాధికారులకు రూ. 3 లక్షల విలువ చేసే వంద గ్లూకోమీటర్లను అందజేశారు. ప్రతి గ్రామంలోను ప్రజల వద్దకు వెళ్ళి వారి ఆరోగ్య సమాచారాన్ని సేకరించి వారికి అవసరమైన చికిత్సలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ వైస్ చైర్మన్ పీ.ఎస్. మునిరత్నం తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్, సురేష్‌బాబు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పాల్ శ్రీనివాస్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం

కుప్పం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కడాపీవో వికాస్‌మర్మత్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ సమస్యలను తెలుసుకునేందుకు ఇప్పటికే ప్రజాదర్బార్ చేపడుతున్నామన్నారు. అలాగే నియోజక వర్గంలో ప్రతి బుధవారం ముందుగా ఎన్నుకోబడ్డ ఓ పంచాయతీలో ప్రభుత్వ శాఖలకు చెందిన 26 శాఖల అధికారులు క్షేత్రస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సదరు కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొని వారి సమక్షంలో ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించి వీలైనన్ని సమస్యలు అక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. 20వ తేదిన రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీలో మన పంచాయతీ వద్దకే మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిసామని పీవో తెలిపారు.

ఆలయ స్థలాల ఆక్రమణలపై సర్వే


షాపులను కొలతలు వేస్తున్న అధికారులు

చౌడేపల్లె, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గోసల కురప్పలైలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ ఆధ్వర్యంలో శనివారం సర్వే చేశారు. బస్టాండు వద్ద ఆలయ మాన్యం భూమిలో (సర్వే నంబర్ 178/1లో 10 సెంట్లు, 178/2లో 21సెంట్లు, 180/2లో 1.59 సెంట్లు) ఎవరెవరు ఎంత విస్తీర్ణంలో దుకాణాలు, ఇళ్ళు నిర్మించారు అని కొలతలు వేసి వివరాలు నమోదు చేసుకున్నారు. 59 దుకాణాలు, 56 ఇళ్ళు అక్రమ నిర్మాణాలు చేసినట్లు తెలిపారు. వివరాలు దేవదాయ కమిషనర్‌కు పంపి వారి ఆదేశాలతో తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. దేవదాయ శాఖ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి, రమణ, గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, హరిప్రసాద్, సర్వేయర్లు, వీఆర్‌వో విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల భూములను కాపాడాలి

పుంగనూరురూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు అన్నారు. శనివారం భీమగానిపల్లెకు చెందిన గుర్రంకొండ మునిచెంగప్ప భార్య చిన్నపాపమ్మకు చెందిన సర్వే నెంబరు 406/5లో 1.15ఎకరాలను రిజిష్టర్ కార్యాయంలో పని చేస్తున్న బాలాజీ ఆమెకు తెలికుండా రికార్డులు మార్చుకున్నారని బాధితురాలు తమ వద్దకు వాపోయిందన్నారు. భూమి, రికార్డులు పరిశీలించగా చిన్నపాపమ్మకే ఉన్నట్లు తెలిసిందన్నారు. అధికారులే రికార్డులు మార్పు చేస్తే పేదలు ఎలా బతకాలని వారు మండిపడ్డారు. ప్రభుత్వం బాలాజీపై ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు

● రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం

చౌడేపల్లె, నవంబర్16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం తీసుకొచ్చిన 'అపార్ రెవెన్యూ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. మండలంలో సుమారు రూ.6వేలు మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి విద్యార్థి అపార్ కోసం ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంలో తప్పులు లేకుండా సర్‌నేమ్‌తో కలసి ఉండాలి. అయితే చాలామంది విద్యార్థులకు బర్త్ సర్టిఫికెట్స్ సక్రమంగా లేవు. అలాగే ఆధార్ కార్డులో కూడా చాలామందికి సర్ నేమ్ బదులు ఇన్‌సిల్ మాత్రమే నమోదయ్యాయి. వాటిని మార్చడానికి ఆధార్ సెంటర్ల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు తిరుగుతున్నారు. అలాగే బర్త్ సరిఫికెట్ల కోసం రెవెన్యూ, ఏఎస్‌వో, పంచాయతీ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం. ఇదే అదనుగా పలువురు రెవెన్యూ అధికారులు సంతకాల కోసం ఒక్కొక్కరి నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వసూళ్ళు అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గంగవరం పీహెచ్‌సీ తనిఖీ



గంగవరం,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్ కుమార్ గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సామరాజపల్లెలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ఫిజిషియల్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించేలా ఆరోగ్యశాఖ సిబ్బంది సహకరించాలన్నారు. కలగటూరులో లార్వా సర్వేను తనిఖీ చేసి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటినిల్వలు, మురుగు నిల్వలు ఉండకుండా జాగ్రత్త వహించి, వారానికి ఒకరోజు డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసులు, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, సీహెచ్‌ఓ మనోరమ, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలదే ప్రధాన పాత్ర


విలేకరులను సన్మానిస్తున్న అధ్యాపకులు

సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యోద్యమ కాలంలో పత్రికలు ప్రముఖ పాత్ర వహించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించాయని సోమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు పేర్కొన్నారు. శనివారం ఆ కళాశాలలో జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పలువురు విలేకరులను అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నించేది పత్రికలని, నిర్భయంగా, నిజాయతీగా, వాస్తవాలను ప్రభుత్వానికి నివేదించడంలో విలేకరులు ముందుంటారని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు రామకృష్ణ, శివయ్య, రవీంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, పుష్పకాంత్, శ్రీకాంత్, నాగరత్న, సుధా, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సింగిరిగుంటలో వైద్యశిబిరం

పుంగనూరు రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిరిగుంటలో తిరుపతి రమాదేవి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ నాయకుడు మంజునాథ్ తెలిపారు. శనివారం గ్రామ సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు.

పలమనేరు

కుప్పం/పుంగనూరు

ఆధార్ సెంటర్ల ఏర్పాటు

పలమనేరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు వార్డు సచివాలయం, రాజీవ్‌గాంధీనగర్ వార్డు సచివాలయం, కొత్తపేట వార్డు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ ఆధార్ సెంటర్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన,(ఏపీఏఆర్) బర్త్ సర్టిఫికెట్లలో సవరణలుంటే సంబంధిత వార్డు సచివాలయాల్లో పరిష్కరించుకోవాలని కోరారు.

20న జాబ్ మేళా

పుంగనూరు , నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పుంగనూరు వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం కృష్ణప్ప తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ పాసైన ఉండి 19 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉండాలన్నారు. సొంత ద్విచక్రవాహనంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9676180056 నంబరులో సంప్రదించాలని కోరారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచింగ్ దొంగ

పుంగనూరు రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి నడిచి వెళుతున్న మహిళ మెడలో నుంచి 32గ్రాముల బంగారు గొలుసును ఓ యువకుడు బైక్‌పై వచ్చి లాక్కెళుతుండగా స్థానికులు అప్రమత్తం అయ్యారు. వెంబడించి నిందితుడిని పట్టుకున్నారు. అతను మోదుగులపల్లె పంచాయతీ లక్ష్మీతాండాకు చెందిన బాలాజీనాయక్ కుమారుడు ప్రసాద్‌నాయక్‌గా గుర్తించి పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు. నిందితుడు పుంగనూరు ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నట్లు తెలిసింది.

జర్నలిస్టుల సమస్యలపై ఆర్డీవోకు వినతి



పలమనేరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి) : జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం జర్నలిస్టులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. అనంతరం ఆర్డీవో భవానికి జర్నలిస్టుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అర్హులందరికీ నివేశస్థలాలు ఇవ్వాలని కోరారు.

మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు



పుంగనూరు, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలు ఏర్పాటు చేయాలని టీడీపీ మైనార్టీ నాయకుడు సుహేల్ బాషా సూచించారు. శనివారం పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా చాంబర్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేశారు. మైనార్టీ నాయకులు సద్దాంహుసేన్, అబ్బాస్, నదీమ్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు

సదుం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చెరుకువారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో డా.గిరీషా ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు శనివారం వైద్య, ఆరోగ్య పరీక్షలు చేశారు. పోషక లోపం, రక్తహీనత, తలసీమియా, దృష్టిలోపం, పుట్టుకతో వచ్చిన జబ్బులు తదితర వాటిపై ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు నీలకంఠ, జానకి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శ్రావణి, మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాటిగుంటపాళెం చెరువుకు గండి



సదుం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిగుంటపాళెం పంచాయతీ పాళెం చెరువు కట్టకు శనివారం గండి పడింది ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి నీరు పుష్కలంగా చేరింది. నిండుకుండలా తొణికిసలాడుతున్న చెరువుకు గండి పడడాన్ని శనివారం ఉదయాన్నే గుర్తించిన ఆయకట్టు దారులు గండి పూడ్చివేతకు సత్వర చర్యలు చేపట్టారు. గండి పూడ్చివేత పనుల్లో తహసీల్దారు ఎస్ఎం హుస్సేన్, టీడీపీ నాయకులు మహేశ్వర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

కుప్పం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ సంస్థ, బెంగళూరు శంకర్ నేత్రాలయ ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహిచన్నుట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్‌బాబు తెలిపారు. కుప్పం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుర్గంకొండలో శివదీక్ష భక్తుల ఇరుముడులు

సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని దుర్గంకొండ మునీశ్వరస్వామి ఆలయంలో శివదీక్ష భక్తులు ఇరుముడులు చెల్లించుకున్నారు. పెద్దఉప్పరపల్లె సమీపంలోని మోక్షేశ్వరస్వామి ఆలయంలో గురుస్వామి త్రివిక్రమ శర్మ అభిషేకపూజలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇరుముడులకు పూజలు జరిపారు. అనంతరం శివనామస్మరణలతో కాలి నడకన దుర్గంకొండకు చేరుకుని మొక్కుబడులు చెల్లించారు. పేటూరు, పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె , పత్రపల్లె, రెడ్డివారిపల్లె తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పరిహారం కోసం పడిగాపులు

చల్లంపల్లె ప్రాజెక్టు బాధితులకు అందని నష్ట పరిహారం ● అధికారుల చుట్టూ ప్రదక్షణలు


చల్లంపల్లె ప్రాజెక్టు

రొంపిచెర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చల్లంపల్లె ప్రాజెక్టుకు భూములు కోల్పో యిన బాధితులకు ఏళ్లు గడుస్తున్నా పరిహారం అందలేదు. రొంపిచెర్ల మండ లం గానుగచింత పంచాయతీ చల్లం పల్లె సమీపంలో గాజులేరు నదిపై చల్లంపల్లె ప్రాజెక్టును 2009లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ ఆర్ కంపెనీ సుమారు రూ.13కోట్లతో నిర్మించింది. ఈ ప్రాజెక్టు ఎర్రావారిపాలెం, రొంపిచెర్ల మండలాల సరిహద్దులో నిర్మించారు.ఈ రెండు మండలాలకు రూ8,92,82,128 పరిహారం చెల్లించాల్సి వుంది. ప్రాజెక్టు పూర్తిగా రొంపిచెర్ల మండలంలో వుంది. గానుగచింత పంచా యతీకి చెందిన 26 మంది రైతులకు సం బంధించి సమారు 49ఎకరాలు ముంపునకు గురయ్యాయి. వీరికి అందాల్సిన రూ65,73,991లు పరిహారం అందలేదు. 14 సంవత్సరాలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు చుట్టూ తిరుగుతూ తమ గోడు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. జయబ్బ నాయుడు, చంద్రయ్య నాయుడు, చిన్నబ్బ నాయుడు, ప్రభావతమ్మ, ఉజయని నాగేశ్వర రావు, నాగయ్య, వెంకటనాగులు, కల్లా సబ్బయ్య, ఎం.రమణయ్య, రామకృష్ణ తదితరులు భూములు కోల్పోయారు. గత ప్రభుత్వంలో ఇదిగోఅదిగో పరిహారం వస్తుందని తమ వద్ద సంతకాలు తీసుకొన్నారే కానీ పరిహారం మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని బాధిత రైతులు వాపోతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామానికి వచ్చిన పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి బాధితులు వినతిపత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. గత నెల 17వ తేదీ చిత్తూరు జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ మల్లెలమిట్ట ప్రాజెక్టు పరిశీలనకు వచ్చినపుడు కూడా రైతులు కలిసి తమకు న్యాయం చేయాలని వినతి పత్రం ఇచ్చారు.

ఆకలితీర్చే భూమి కోల్పోయాం



మాకు జీవనాధారమైన వ్యవసాయ భూమి ముంపునకు గురైంది కానీ ఇంత వరకు పరిహారం రాలేదు. వరి సాగు చేసి కడుపునింపు కొనే భూమి పోయింది. దానికి ప్రతిఫలం అందలేదు.

- జయబ్బనాయుడు

పండ్లతోటలు కోల్పోయాను



నాకున్న రెండు ఎకరాల్లోని మామిడి తోటను ప్రాజెక్టు ముంపు కింద భూమి కోల్పోయాను. ప్రాజెక్టు నిర్మించినా పరిహారం అందించడంలో అధికారులు చిన్నచూపు చూస్తున్నారు.

- ఈశ్వరయ్య

ప్రణాళికాబద్ధంగా పంచాయతీల అభివృద్ధి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఏపీఆర్ కుమార్

శాంతిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికాబద్ధంగా పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని డీఎల్పీవో రాధాకృష్ణ, జడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంపీడీవో ఏపీఆర్ కుమార్ అన్నారు. శనివారం మండల సచివాలయం సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వెలుగు వీవో లీడరు, ఎంపీటీసీలు, సర్పంచులకు అభివృద్ధి ప్రణాళికపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో చేపట్టవలసిన అభివృద్ధిని ఆయా గ్రామాల ప్రజలతో చర్చించి ప్రణాళికను తయారు చేయాలన్నారు. ఆ గ్రామానికి ఏమి అవసరమో గురించి అభివృద్ధి ప్రణాళికలో చూపాలన్నారు. వైస్ ఎంపీపీ పట్టాభి, కో ఆప్షన్ సభ్యుడు నిషార్, కెనమాకులపల్లె సర్పంచ్ జయరాం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : ప్రత్యేక ప్రణాళికలతో పంచాయతీలను అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. శనివారం ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై జడ్పీటీసీ, సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్స్‌కు, వీవోలకు ప్రణాళికలపై అవగాహన కల్పించారు.ఈవోఆర్డీ కృష్ణవేణి, ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : గ్రామ పంచాయతీలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలని ఎంపీడీవో లీలామాధవి కోరారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. టీవోటీలు నరసింహులు, బసవరాజులు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతతోపాటు పంచాయతీకి ఆర్థిక వనరుల సేకరణపై అవగాహన కల్పించారు.

తాత్విక ధోరణిలో తిరువళ్లువర్, వేమన సమాజ పరిశీలన

ద్రావిడ వర్సిటీ సహాయాచార్యులు డాక్టర్ హరికృష్ణ


సదస్సులో పాల్గొన్న విద్యావేత్తలు

అడయార్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లువర్, వేమన ఇద్దరూ ప్రజా కవులేనని, వారిద్దరూ సమాజాభ్యున్నతిని కాంక్షిస్తూ, సమాజాన్ని తాత్విక ధోరణిలో పరిశీలించారని కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయ సహాచార్యులు డాక్టర్ ఎం.హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం పాలక్కాడ్‌లోని టీసీఆర్‌సీ, చెన్నై హిందీ ప్రచారక్ సంఘ్, డీఏవీ కాలేజ్ (అజ్మీర్), సేలంకు చెందిన తేళ ఎఫ్ఎం సహకారంతో రాజ్‌భవన్‌లో 'తిరువళ్లువర్, కబీర్ దాస్, యోగి వేమన' సారూప్యతపై జరిగిన అంతర్జాతీయ సాహితీ సదస్సును గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సులో తొలి రోజు వివిధ అంశాలపై భాషా పండితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా, ద్రావిడ విశ్వవిద్యాలయం సహాయాచార్యులు డాక్టర్ హరికృష్ణ 'తిరువళ్ళువర్ - వేమన ఆలోచనా ధోరణలు - సారూప్యత' అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. వేమన, తిరువళ్ళువర్ సమాజాభ్యున్నతిని ఆకాంక్షించిన వారేనని తెలిపారు. వీరిద్దరి సాహిత్య రచనల్లో అనేక పోలికలున్నాయన్నారు. వీరిద్దరికి దాదాపు వెయ్యి సంవత్సరాల వ్యత్యాసం ఉన్నా కానీ, ఇద్దరి కాలాల్లో అనేక అంశాలు ఒకే రకంగా ఉండేవన్న విషయం గ్రహించవచ్చన్నారు. వేమన భాష ఒక సామాజిక విప్లవమంటూ.. డాక్టర్ హరికృష్ణ అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో యోగివేమన యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎస్.ఈశ్వర రెడ్డి, డాక్టర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య ఎల్బీ కృష్ణారెడ్డి కూడా పత్రసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా ప్రొఫెసర్ ఎస్.లక్ష్మి అయ్యర్, డాక్టర్ కేటీ మురుగేశన్, ప్రొఫెసర్ సంజయ్ అరోరా, డాక్టర్ కల్పన, డాక్టర్ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారుల సేవలు అమోఘం


గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి, పాఠకులు

పలమనేరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలకు ఊపిరిపోసిన మహనీయుల సేవలు మరువలేనివని పలమనేరు గ్రంథాలయ అధికారి హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులైన గాడిచర్ల సర్వోత్తమ రావు, అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్సార్ రంగనాథన్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత గతంలో సంపన్నులు, జమీందార్లకు మాత్రమే గ్రంథాలయాలు అందుబాటులో ఉండేవని, ఉద్యమకారుల పోరాట ఫలితంగా నేడు అన్నివర్గాల వారు గ్రంథాలయాలను వినియోగించుకుంటున్నారన్నారు. నేడు గ్రంథాలయాల్లో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అనేకం అందుబాటులో ఉన్నాయని, యువతీ యువకులు ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలలో రాణించాలని పిలుపు నిచ్చారు.

నేడు కవి సమ్మేళనం

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి హేమంత్‌కుమార్, పలమనేరు రచయితల సంఘ గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిరు జల్లులతో రైతులకు తిప్పలు


సోమలలో పొలం వద్ద బండలపై వరి ధాన్యం కుప్పలు

సోమల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. వరి కోతల సమయంలో వర్షాలు పడుతుండడంతో కోతకు వచ్చిన వరి గింజలు నీటిలోనే నానుతున్నాయి. సోమల మండలంలో 1240 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐదు వందల ఎకరాల్లో కోతకు వచ్చాయి. రైతులు విధిలేక వరి నూర్పిడి యంత్రాలతో పోటీలు పడుతూ కోతలు చేస్తున్నారు. పొలంలో నీట మునిగిన వరి కోతకు యంత్రాలు రాకపోవడంతో కూలీలకు సైతం డిమాండ్ వుండి కూలి రూ. 500 నుంచి రూ.600 పెంచి కోతలు చేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతలు పూర్తి చేసి కొందరు వరిధాన్యం పొలం వద్ద కుప్పలు వేయగా వర్షానికి తడిసి మొలకలు వస్తున్నాయి. టమోటా సాగు చేసిన రైతుల పరిస్థితి పెట్టిన పెట్టుబడులు దక్కలేదని ఆవేదన చెందుతున్నారు. తుఫాన్‌తో టమోటా తోటల్లో వర్షపు నీరు నిలిచి పలురకాల చీడపీడలు వ్యాప్తి చెంది పచ్చికాయలే నేల రాలిపోతున్నాయి. కాయలపై నల్లమచ్చలు, ఊజీ ఈగల దాడులతో టమోటా రైతు నష్టపోతున్నారు. చేతికి అందే పంటలు, పశుగ్రాం ఇంటికి చేరకనే పొలాల్లో వదిలేయాల్సి వస్తోందని ఆందోళన పడుతున్నారు.

మాలమహానాడు కరపత్రాల ఆవిష్కరణ



రామకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో ఈ నెల 23వ తేదిన జరిగే మాలమహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల దళిత నేతలు కోరారు. శనివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సమావేశానికి మాల మహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ యమల సుదర్శనంగుండాల మనోహర్ హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో మాలల సమస్యలపై చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో సతీష్, మహేష్, గోవర్ధన్, శ్రీరాములు, రామచంద్ర, రమేష్, కన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన



క్రమశిక్షణ, నైతికవిలువలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నగరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐ మహేశ్వర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. 8, 9, 10వతరగతి విద్యార్థులను సమావేశపరిచి క్రమశిక్షణ, నైతిక విలువల యొక్క ప్రాముఖ్యతను గురించి నగరి సీఐ మహేశ్వర్ వివరించారు. ప్రతి విద్యార్థి తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, దాని సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. బాలికలు రౌడీలనుంచి ఎలా రక్షణ పొందాలో, మహిళా పోలీసులను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. బాలికల వేషధారణ చక్కగాఉండాలని, ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించాలన్నారు. ఉపాధ్యాయులు, పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య మనుగడలో
పత్రికా రంగం పాత్ర అనిర్వచనీయం



మాట్లాడుతున్న వినోద్‌భట్

చిత్తూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య మనుగడలో పత్రికా రంగం పాత్ర అనిర్వచనీయమైనదని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వినోద్‌భట్ అన్నారు. శనివారం అపోలో యూనివర్సిటీలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో పత్రికలు ప్రభుత్వానికి కావలసిన సూచనలతోపాటు జరుగుతున్న తప్పులను కూడా ఎత్తిచూపడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ప్రెస్ నాలుగో పిల్లర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



చిత్తూరు కలెక్టరేట్‌లో ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్ క్లబ్ సంయుక్తంగా శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌ను పాత్రికేయులు కలిసి తమ సమస్యలు, హక్కులపై వినతిపత్రాన్ని ఇచ్చారు. అనంతరం తపోవనంలోని వృద్ధాశ్రమం, బుద్ధిమాంద్యం పిల్లలకు బ్రెడ్లు పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లోకనాథం, కార్యదర్శి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

\- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

మినీ గోకులాలను ఆదుకోండి



పాతార్కాడులో పునాదికే పరిమితమైన మినీ గోకులం

విజయపురం, నవంబరు 16: మినీ గోకులాలను ఆదుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. 2018-19లో టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాలను మంజూరు చేసి రైతులకు ఆసరాగా నిలిచింది. నిధులు కూడా పాక్షికంగా కేటాయించడంతో నిర్మాణాలు ప్రారంభించగా, పునాదులకే పరిమితమై అర్థాంతంగా ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో గోకులం షెడ్డు నిర్మాణాలు పురోగతి లేకుండా పోయాయి. మండలంలోని పాతార్కాడు ఎస్టీ కాలనీకి చెందిన బాలసుబ్రహ్మణ్యం గోకులం షెడ్డును ఏర్పాటు చేయడానికి సిద్ధం చేయగా, పునాదులతో ఆగిపోవడంతో కుటుంబం వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మినీ గోకులాలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు పోటీపరీక్షలు నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

బంగారుపాళ్యం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరచిన వారికి ఈనెల 20వ తేదీన ముగింపు సమావేశంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

నగరి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నగరి మున్సిపాలిటీ పరిధిలోని గ్రంథాలయంలో శనివారం పీసీఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని వెలికి తీయడానికే ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి గురుమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విడతల వారీగా
దంచి కొట్టిన వాన



పలమనేరు రోడ్డులో కురుస్తున్న వర్షం

చిత్తూరు కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం విడతల వారీగా వర్షం దంచి కొట్టింది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు వర్షంలోనే తడిచి ఇబ్బందులకు గురయ్యారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ నీటితో నిండిపోయాయి. మరో వైపు మురుగు కాల్వలోని నీరంతా రోడ్లపై ప్రవహించడంతో నగరవాసులు, ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పొన్నియమ్మ గుడి, చర్చి, బజారు వీధుల్లో చిరు వ్యాపారులు వర్షం కారణంగా తమ వ్యాపారాలను కట్టేసి ఇళ్లకెళ్లారు. వీటితో పాటు మార్కెట్, రైతు బజార్లలో వర్షంతో వ్యాపారులు, కొనుగోలు దారులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు.

విధులు సక్రమంగా నిర్వహించండి

- ఫీల్డ్ అసిస్టెంట్లపై డ్వామా పీడీ ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

పూతలపట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్‌అసిస్టెంట్లు విధులు సక్రమంగా నిర్వహించాలని, లేదంటే స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని డ్వామా పీడీ రవికుమార్ హెచ్చరించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పథకంలో ప్రజలకు వంద రోజుల పనులు కల్పించలేని ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు మూడు పంచాయతీలు మినహా మిగిలిన పంచాయతీల్లో ఉపాధి పనులు సక్రమంగా చేయలేదని బహిరంగ సభలో తేటతెల్లమైందని చెప్పారు. శనివారం జరిగిన బహిరంగ సభ గురించి ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకపోవడంతో ఒకరిద్దరు రైతులు మినహా రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమావేశంలో ఎంపీపీ కుమారి, ఏపీడీ శ్రీనివాసులు, స్టేట్ అబ్జర్వర్లు లోకేష్, మల్లికార్జున్, ఎంపీడీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన హేమలత



చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ కఠారి హేమలత శనివారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

\- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

ఎస్టీ సంఘాల సాధికారతపై చైతన్య సదస్సు

వెదురుకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం పద్మసరస్సు వద్ద శనివారం సీఐడీ, పోలీసు, రెవెన్యూ వారు ఎస్టీ సంఘాల సాధికారత, అఘాయిత్యాల నివారణపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, ఆర్డీవో వై.భవానీశంకర్, ఎస్సీడీపీవో సాయినాథ్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్, జిల్లా ట్రైబల్ అధికారి ఎస్.మూర్తి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

విశ్రాంత అధ్యాపకుల నూతన కమిటీ ఏకగ్రీవం

చిత్తూరు కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పీవీకేయన్ కళాశాలలో జిల్లా విశ్రాంత కళాశాలల అధ్యాపకులు సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘ ప్రతినిధులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వి.హరి నాయుడు, కార్యదర్శిగా జయరామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వైఎస్ మునిరత్నం, కోశాధికారిగా వెంకట్రావును సభ్యులు ఎన్నుకున్నారు.

గరుడుడిపై వేంకటేశ్వరుడి విహారం



బంగారుపాళ్యం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా శనివారం మండలంలోని శెట్టేరి గ్రామంలో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి పటాన్ని గ్రామస్థులు ఊరేగించారు. ఉభయదారులుగా శెట్టేరి సర్పంచ్ అనిల్ కుటుంబసభ్యులు వ్యవహరించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న గంధమనేని

శ్రీరంగరాజపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శనివారం జీఎంఆర్‌పురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్, సోమేశ్వర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లో డీఐవో తనిఖీ



చిత్తూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పెనుమూరు క్రాస్‌లో రెడ్డెప్పరెడ్డి అనే ఆర్‌ఎంపీ ఇంటి వద్దే నిర్వహిస్తున్న క్లినిక్‌ను శనివారం డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి ఆదేశాలతో డీఐవో హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ సంఘ సభ్యత్వం సర్టిఫికెట్ తీసుకొని క్లినిక్ నిర్వహిస్తున్నట్లు డీఐవో తెలిపారు. తనిఖీకి సంబంధించిన నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తామని చెప్పారు.

బీజేపీని బలపరచండి



మాట్లాడుతున్న చిట్టిబాబు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బలపరచాలని ఆ పార్టీ సీనియర్ నేత చిట్టిబాబు పిలుపునిచ్చారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం సంతపేట మండల అధ్యక్షుడు రామభద్ర ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ ఒక్కో క్రియాశీల సభ్యుడు కనీసం 50 మందిని ప్రాథమిక సభ్యులుగా పార్టీలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, వెంకటేష్, సునిల్, రవినాయుడు, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

వెదురుకుప్పం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం చట్టాలపై ఎస్ఐ వెంకటసుబ్బయ్య అవగాహన కల్పించారు. విద్యార్థులకు బాల్య వివాహాలు, పోక్సో, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.

ధర్నాను జయప్రదం చేయండి

చిత్తూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా రైతు, కార్మిక విధానాలపై నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 26వ తేదిన నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో రైతు, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. నాయకులు ఉమాపతి, సరోజ, మంజుల పాల్గొన్నారు.

ఎందుకో తమ్ముళ్లు వెనుకపడ్డారు!

\- టీడీపీ సభ్యత్వ నమోదులో మందకొడి

వెదురుకుప్పం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో ఎందుకో తమ్ముళ్లు వెనుకపడ్డారు. సభ్యత్వ నమోదు మందకొడిగా జరుగుతోంది. జీడీనెల్లూరు నియోజకవర్గంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, పాలసముద్రం, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, గంగాధరనెల్లూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో లైఫ్ టైం సభ్యత్వ నమోదుకు పెనుమూరు, జీడీనెల్లూరు మండలాల నుంచి శనివారం సాయంత్రం వరకూ ఎవరూ ముందుకు రాలేదు. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అక్టోబరు 26వ తేదీ నుంచి జరుగుతోంది.

లైఫ్ టైం సభ్యత్వ నమోదు వివరాలు ఇవీ..

ఈ నియోజకవర్గంలో లైఫ్ టైం సభ్యత్వ నమోదు ఇప్పటి వరకు 22 మంది మాత్రమే తీసుకున్నారు. పాలసముద్రం మండలం నుంచి 12 మంది, ఎస్ఆర్‌పురం నుంచి ఆరుగురు, కార్వేటినగరం నుంచి ముగ్గురు, వెదురుకుప్పం నుంచి ఒకరు తీసుకున్నారు. జీడీనెల్లూరు, పెనుమూరు మండలాల్లో ఇప్పటి వరకూ లైఫ్ టైం సభ్యత్వ నమోదు కాలేదు. ఈ సభ్యత్వానికి రూ.లక్ష చెల్లించాల్సి ఉంది.

సాధారణ సభ్యత్వ నమోదు ఇలా..

నియోజకవర్గంలో వందరూపాయలతో సాధారణ సభ్యత్వ నమోదును శనివారం సాయంత్రానికి 12,348మంది తీసుకున్నారు. కార్వేటినగరంలో 2,680, పెనుమూరులో 2,245, వెదురుకుప్పంలో 2,005, గంగాధరనెల్లూరులో 1,807, పాలసముద్రంలో 1,648, ఎస్ఆర్‌పురం మండలంలో 1,963మంది సాధారణ సభ్యత్వాలు తీసుకున్నారు. సభ్యత్వ నమోదుకు గడువు దగ్గరలోనే ముగుస్తోంది. సభ్యత్వ నమోదు వేగవంతానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ ఇక్కడి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాల్సి ఉంది.

పెట్రోల్, డీజిల్ వాహనాలతో కాలుష్యం



ఒప్పంద పత్రాలను చూపుతున్న చంద్రశేఖర్ నాయుడు, మోహన్ సత్యరంజన్

పూతలపట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్ వాహనాలు అధిక కాలుష్యాన్ని సృష్టిస్తాయని వేము ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు అన్నారు. పూతలపట్టు మండలం పి.కొత్తకోట సమీపాన గల వేము ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం టాక్వాఅనాల్ సంస్థతో అవగాహన ఒప్పంద కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల కారణంగా పర్యావరణం పరిరక్షించబడుతోందని, తమ కళాశాలలోని విద్యార్థులను నైపుణ్యులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కేంద్రం రూపొందించినట్లు చెప్పారు. టాక్వాఅనాల్ సీఈవో మోహన్ సత్యరంజన్ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న వాహనాలను విద్యుత్ వాహనాలుగా పరివర్తనం చేయడం తమ సంస్థ ఉద్దేశ్యమన్నారు. విద్యార్థులకు ఈ విషయాలపై శిక్షణ, అవగాహన కల్పించడానికి ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ కిలారి, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళండి



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజు

గంగాధరనెల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేసే సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీజేపీ కిసాన్‌మోర్చా కార్యదర్శి, పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి యువరాజు కోరారు. గంగాధరనెల్లూరు బీజేపీ కార్యాలయంలో గ్రామాల్లో బూత్‌కమిటీల నియామకంపై పార్టీ మండల అధ్యక్షుడు ఎం.మురళి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మణివర్మ, కార్యదర్శి జి.కె.చౌదరి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రాజేంద్రన్, ఎస్సీ మోర్చా మాజీ ప్రధానకార్యదర్శి సుందరరాజు, మండల బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు ఆనందబాబు, మహిళామోర్చా అధ్యక్షురాలు అంజలి, నేతలు నారాయణాచారి, నరసింహులు నాయుడు, శివయ్య పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో శానిటేషన్ డ్రైవ్



వెదురుకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో శనివారం శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా పంచాయతీ రాజ్ విస్తరణాధికారి పురుషోత్తం పర్యవేక్షణలో పనులు జరిగాయి. చెత్తదిబ్బల తొలగింపు, శానిటేషన్, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ వంటి కార్యక్రమాలను చేపట్టారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బంగారుపాళ్యం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

ఎస్ఆర్‌పురంలో...

శ్రీరంగరాజపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సరిత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

వృత్తిపరమైన కోర్సుల్లో పోటీతత్వం ఉండాలి



ఫ్రెషర్స్‌డేలో మాట్లాడుతున్న తేజోమూర్తి

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వృత్తి పరమైన కోర్సుల్లో పోటీతత్వం ఉండాలని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి అన్నారు. శనివారం స్థానిక విజయం బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణంలో విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. అకడమిక్ ఈడీ శైలజమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని అవకాశాలు అందింపుచ్చుకుని రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విజయం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం నాయుడు, బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ జయంత్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిగట్ల పూజలు



చిత్తూరు కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని ముత్తుకూరు పల్లెలో శనివారం అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు భక్తి ప్రపత్తులతో పడిగట్ల పూజలు చేశారు. జ్యోతి గ్రానైట్స్ అధినేత ద్వారకా నాయుడు ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు మోహన్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, చిట్టిబాబు నాయుడు, సోమసుందరం నాయుడు, సురేష్, రామారావు తదితరులు పాల్గొని అయ్యప్ప స్వామికి పూజలు చేశారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, జిల్లా కార్యాలయ ప్రతినిధి మోహన్‌రాజ్, చిత్తూరు ఎమ్మెల్యే సోదరుడు జీవన్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనగా, నిర్వాహకులు అన్నదానం చేశారు.